క్లుప్తంగా

ఐఐఐటీ విద్యార్థులకు ఆర్థిక సాయం



తెనాలిఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని డాక్టర్ వేమూరి శేషగిరిరావు, గుత్తా వెంకటరత్నంలు సూచించారు. ఈదర విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఐఐఐటీ సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.రెండు వేలు చొప్పున ఆరుగురికి తెనాలిలో మంగళవారం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఈదర వెంకట్రావు, వేజళ్ల ఉమామహేశ్వర్, ఈదర పూర్ణచంద్, పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళి, సాయి, కె వాసుదేవనాయుడు, గమ్మడి ప్రసాద్, కె నందకిషోర్, డీవీ సుబ్బారావు, కె శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21న వాకర్స్ క్లబ్ 24వ వార్షికోత్సవం

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి 24వ వార్షికోత్సవం ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఆరోజు ఉదయం 7.30 గంటలకు ఏర్పాటయ్యే వార్షికోత్సవానికి భారతీయ స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ నోరి ఎల్‌కేఎంవీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ వాకర్‌గా వేములపల్లి వెంకట్రామయ్య, ఉత్తమ మహిళా వాకర్‌గా మొయ్య శ్రీలక్ష్మి, ఉత్తమ యోగసాధకుడు నాగం వెంకటేశ్వరరావును అవార్డులతో సత్కరిస్తారు. సీనియర్ వాకర్స్ జీపీపీ చంద్రశేఖరరావు, ప్రభల సూర్యనారాయణమూర్తి, దొడ్డపనేని అచ్చయ్య, రాపర్ల నర్సయ్య, బీఎస్ సీహెచ్‌పీ ప్రసాదరావుకు చిరు సత్కారం ఉంటాయని క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం, కార్యదర్శి కడియాల రవిబాబు తెలియజేశారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: దోపిడీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్. రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పెదవడ్లపూడికి చెందిన లారీ డ్రైవర్ జలసూత్రం సుబ్బారావు ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక తెనాలికి రైలులో చేరుకున్నాడు. అక్కడి నుంచి స్వగ్రామం వెళ్లేందుకు బస్టాండ్ సమీపంలోని సాయిబాబా గుడి వద్దకు వచ్చి ఆటో కోసం ఆగాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా సుబ్బారావు నిరాకరించడంతో చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.నాలుగు వేలు లాక్కు వెళ్లారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఏఎస్ఐలు పి.దేవప్రసాద్, షేక్ హైదర్ అలీ, పీసీలు పి.మురళి, ఎం.అంకయ్యలు కేసులో నిందితులను తెనాలి మండలం మల్లెపాడుకు చెందిన వరగాని ఆనంద్ వర్ధన్, ఆర్ఆర్ నగర్‌కు చెందిన షేక్ సంధానిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

19న మోదుకూరులో వేమన జయంతి మహోత్సవం

మోదుకూరు(తెనాలి): చుండూరు మండల గ్రామం మోదుకూరులో వేమన జయంతి మహోత్సవాన్ని ఈనెల 19న నిర్వహించనున్నారు. మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ, ఆంధ్ర లయోలా కాలేజి, విజయవాడ సంయుక్త నిర్వహణలో గ్రామంలోని వేమన సాహిత్య వికాస భవనంలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకు చుండూరు మండల స్థాయి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం, అనంతరం వేమన జయంతి ఉత్సవ సభ ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు. 2019–24 వరకు మోదుకూరులో జరిగిన వేమన జయంతి ఉత్సవాల చరిత్ర రెండో భాగాన్ని సభలో ఆవిష్కరిస్తారు. ఆంధ్ర లయోలా కాలేజి ప్రాచార్యులు ఆచార్య గుజ్జుల ఆంటోనీ పీటర్ కిషోర్ అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వ బీసీడీఈ కార్యదర్శి, సీఈవో డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ విశ్రాంత ఆచార్యులు ఆచార్య గాచపాటి ఉమామహేశ్వరరావు, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, 'అమ్మనుడి' సంపాదకుడు డాక్టర్ సామల రమేష్‌బాబు పాల్గొంటారని వివరించారు.

ముగిసిన ధార్మిక శిక్షణా తరగతులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం మస్జిద్ ఎ మొహమ్మద్‌తో నిర్వహిస్తున్న ధార్మిక శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్దుర్రహ్మాన్ విచ్చేసి మాట్లాడారు. ఇల్మ్ ప్రాముఖ్యతపై అబ్దుల్ హఫీజ్ ఉమ్రీ, బిద్ అత్ పర్యవసానం అనే అంశంపై అబ్దుల్ మబూద్ జామిఈ, సున్నత ప్రాముఖ్యతపై అబ్దుల్లా జామిఈ, షిర్క్ (బహు దైవారాధన) అనే అంశంపై ఇల్యాస్ దాయీ, ఉలమాయే దీన్‌కి ఫజీలత్ అనే అంశంపై ఫయాజ్ ఆలమ్ అల్వానిలు ప్రసంగించారు.

పాడి పశువులను అభివృద్ధి చేసుకోవాలి

- ఎమ్మెల్యే శివకుమార్
- ఎడ్ల బలప్రదర్శన పోటీలను తిలకించిన ఎమ్మెల్యే



ఎడ్ల జత రైతులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రైతులు పాడి పశువులను, ఒంగోలు జాతి పశువులను అభివృద్ధి చేసి మన దేశ సంస్కృతిని కాపాడుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మంగళవారం కొల్లిపర గ్రామంలో చెంచల రామిరెడ్డి ఇటుక బట్టి ఆవరణలో సంక్రాంతి పండుగని పురస్కరించుకొని రెండు రోజుల నుంచి జరుగుతున్న జాతీయ ఒంగోలు జాతి వృషభరాజముల పుటీ బల ప్రదర్శన పోటీలను ఆయన తిలకించి పోటీలకు ఎడ్ల జతను తీసుకువచ్చిన పాడి రైతులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఒంగోలు జాతి ఆవులు, ఎడ్లలను అభివృద్ధి కోసం వాటిని పెంచి పోషించాలని కోరారు. గతంలో ప్రతి రైతు కుటుంబంలో పుష్కలంగా ఆవులు, గేదెలు వంటి పశువులు పెంచి వాటి ద్వారా వారి కుటుంబ పోషణ ఏర్పాటు చేసుకోవటమే కాకుండా, తెలుగు జాతి అభివృద్ధికి వాటిని పెంచి పోషించే వారు అని గుర్తు చేశారు. రాష్ట్రంలో పాడి రైతుల కోసం ప్రభుత్వం అనే సంక్షేమ పథకాలు అందిస్తుందని వాటిని పాడి రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం వివిధ కేటగిరిలో గెలుపొందిన ఎడ్ల జత కమిటీ సభ్యులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గుడిబండి చిన వెంకటరెడ్డి, పార్టీ నాయకులు జొన్నల శివారెడ్డి, ఈదా యశ్వంత్ రెడ్డి, అన్నవరపు రమేష్, కళ్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, ఈమని హరికోటిరెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

'అన్నాబత్తుని' సంక్రాంతి సంబరాలు



'అన్నాబత్తుని' సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సంక్రాంతి పండగ వచ్చిందంటే సంబరాలకు చిన్నాపెద్దా సిద్ధమైపోతారు. అన్ని పండగల్లోకి సంక్రాంతిదే ఆ ప్రత్యేకత. ఉన్నంతలో పండగ చేసుకునేవారు కొందరు, పండగ పూట విందు వినోదాల్లో మునిగితేలేవారు మరికొందరు...స్నేహితులు, కుటుంబసభ్యులతో వేడుక చేసుకునేవారూ ఉంటారు. ఇలాంటి వేడుకల్లో 'అన్నాబత్తుని' సంక్రాంతి సంబరాలు ఈసారి పండుగలో చోటుచేసుకున్నాయి. తెనాలిలో అన్నాబత్తుని ఇంటి పేరు కలిగిన కుటుంబాలకు చెందిన అందరూ కనుమ రోజైన మంగళవారం కలుసుకున్నారు. స్థానిక మార్కెట్ సెంటర్లోని అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్, తెనాలి జెడ్పీటీసీ జయలక్ష్మి దంపతుల నివాస ప్రాంగణం ఇందుకు వేదికైంది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోదరుడే శ్రావణ్‌కుమార్. ఎమ్మెల్యే శివకుమార్–పుష్ప దంపతులు, వారి మాతృమూర్తి, కుమారులు అన్నాబత్తుని సత్యనారాయణ, అఖిల్ గణేష్ సహా ఆ ఇంటిపేరు కలిగిన పలువురు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. యోగక్షేమాలను మాట్లాడుకున్నారు. పండగ విందు ఆరగించి సంతోషాలను పంచుకున్నారు.

భారత సైనికుల సేవలను స్మరించుకోవాలి



విశ్రాంత ఆర్మీ అధికారి మోహనరావును సన్మానిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

తెనాలిఅర్బన్: దేశం కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న భారత సైనికుల సేవలను అందరూ స్మరించుకోవాలని విశ్రాంత ఆర్మీ అధికారి మోహనరావు, 22వ ఆంధ్రా బెటాలియన్ అధికారి సుబేదార్ అవతార్ సింగ్ పేర్కొన్నారు. భారత సైనిక దినోత్సవాన్ని సోమవారం కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ భారత కమాండర్ ఇన్ చీఫ్‌గా కరియప్ప బాధ్యతలు స్వీకరించిన రోజును అందరు ఆర్మీ డేగా జరుపుకుంటారని చెప్పారు. దేశ క్షేమం కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ సైనికులు అందించే సేవలు మరువరానివని చెప్పారు. అనంతరం డ్రాయింగ్, వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అవతార్‌సింగ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబి, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, ఉపాధ్యాయులు పసుపులేటి మోహనరావు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



కేసు వివరాలు తెలుపుతున్న సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. తెనాలి సుల్తానాబాద్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వెంబడి మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎస్ఐ ఎం విజయ్‌కుమార్‌కు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ ఏఎస్ఐ హైదర్ అలీ, పీసీలు పి.మురళి, ఎం.అంకయ్యలతో కలసి అక్కడకు చేరుకున్నారు. ప్లాస్టిక్ గోతాల్లో మద్యం సీసాలను ఉంచి విక్రయిస్తున్న ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులను సుల్తానాబాద్‌కే చెందిన కాట్రోతు శ్రీనునాయక్, రమావత్ కార్తీక్‌నాయక్‌లుగా గుర్తించారు. వారి వద్ద నుంచి 50 మ్యాన్షన్ హౌస్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలంగాణలోని కోదాడకు వెళ్లి అక్కడి వైన్ షాపులలో మద్యం కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను పట్టుకోవడంలో అప్రమత్తంగా వ్యవహరించిన ఎస్ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.

మంచాలలో ఘనంగా గ్రామోత్సవాలు



గ్రామోత్సవంలో ప్రత్యేక వాహనాలపై ముగ్గురు స్వామి వార్లు ఊరేగింపు జరుగుతున్న దృశ్యం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామి వార్ల గ్రామోత్సవ కార్యక్రమాలు వైభంగా జరిగాయి. మండల కేంద్రమైన చేబ్రోలు, మంచాల, శలపాడు, శ్రీరంగపురం, నారాకోడూరు, శేకూరు తదితర గ్రామాల్లోని ప్రదాన ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి కల్యాణోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం స్వామి వార్లు ప్రదాన రహదారుల్లో ఊరేగింపు జరిగింది. చేబ్రోలులోని ప్రదాన దేవాలయాలైన సంక్రాంతి పండుగ రోజున నాగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, ఆదికేశవస్వామి, రంగనాథ స్వామి, జ్వాలా లక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మంచాల గ్రామంలోని గంగా పార్వతి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, కోదండరామస్వామి, వేణుగోపాలస్వామి దేవస్థానాల్లో ధనుర్మాస సందర్భంగా కల్యాణోత్సవాలు జరిగాయి. అనంతరం ట్రాక్టర్లపై స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రధాన రహదారుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గత నెల రోజులుగా ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో అర్చకస్వాములు ప్రత్యేక పూజలు, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. వేజండ్ల గ్రామంలోని కోదండరామస్వామి, శ్రీరంగపురంలోని మోహన రంగ నాయకస్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అర్చకులు గ్రామోత్సవం నిర్వహించారు.

పొలం గట్ల తగాదాలో కత్తితో వ్యక్తిపై దాడి

గుంటూరు రూరల్: పొలంగట్ల వద్ద ఏర్పడిన తగాదాలో ఒక వ్యక్తిపై ప్రత్యర్థులు కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం చౌడవరం గ్రామానికి చెందిన తోకల శివనాగేశ్వరరావు స్థానికంగా పొలం పనులు చేసుకుని జీవిస్తుంటాడు. అతని పొలం పక్కనే యనగంధాల శ్రీరామయ్య పొలం ఉంది. ఎప్పటినుంచో ఇరువురి మధ్యన పొలం హద్దుల తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శివనాగేశ్వరరావు తన పొలం వద్ద పనిచేసుకుని ఇంటికి తిరిగి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శ్రీరామయ్య అతని వద్దకు వచ్చి కొబ్బరిబోండాలు నరికే కత్తితో దాడి చేశాడు. దీంతో శివనాగేశ్వరరావుకు తల కడుపులో, ఛాతీపై, బుజంపై తీవ్రగాయాలయ్యాయి. హత్య చేసేందుకు కుట్రపన్నాడని తేరుకుని శివనాగేశ్వరరావు తన ద్విచక్రవాహనంపై అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటికి చేరుకుని బంధువులతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వెళ్ళారు. జీజీహెచ్‌లో పరీక్షించిన వైద్యులు శివనాగేశ్వరరావు పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. శివనాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



తెనాలిటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ చినరావూరులో సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 100 మంది మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులను రంగురంగులతో వేశారు. విజేతలకు కౌన్సిలర్ కొర్రా యశోద బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు ధరావత్ ప్రసాద్‌నాయక్, తేజావత్ కావ్య, కేతావత్ సునీత, బాబు నాయక్, రాములు నాయక్, కృష్ణా నాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

19న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ అబ్రహం లింకన్

తెనాలి: విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాల్సిందిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, అంబేడ్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, బలహీనవర్గాల ఆశాజ్యోతి, ప్రజాహక్కుల నాయకుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్రప్రభుత్వం విజయవాడలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసినట్టు తెలిపారు. స్త్రీ విముక్తి ప్రధాత, కులనిర్మూలనతోనే దేశాభివృద్ధి జరుగుతుందని చెప్పిన గొప్ప విద్యావంతుడు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న మన జాతికి అంకితం చేస్తున్నట్టు తెలిపారు. ఈ వేడుకకు అభ్యుదయ భావాలు కలిగిన మేధావులు, ప్రజాసంఘాలు, కార్యకర్తలు, భౌతికవాదులు, కళాకారులు, రాజకీయనాయకులు అన్ని ప్రాంతాల నుంచి తరలిరావాలని కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

రాష్ట్ర సమాచార కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి



రావెల(తాడికొండ): సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ టి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాడికొండ మండలం రావెల గ్రామంలో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పరిషత్ ఉపాధ్యక్షులు భీమవరపు ధర్మారెడ్డి, ఈమని, భాస్కర్‌రెడ్డి, వంగపాటి బ్రహ్మం, ఏరువ లూర్థురెడ్డి, సింహాద్రి మధుసూదన్‌రెడ్డి, వరగాని వెంకటేష్ పాల్గొన్నారు.

యోగా క్యాలెండర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం మంగళగిరి పట్టణానికి చెందిన శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నూతన సంవత్సర యోగా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్ విచ్చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యోగ సాధన ద్వారా మనిషి ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ, యోగ సాధకులు దోగిపర్తి శ్రీహరిరావు, కందం రాంబాబు, జె.నారాయణ, కాండ్రు కోటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విశేషంగా అభిషేకాలు



పండ్ల రసాలతో అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న కొండా గురుస్వామి



చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో జ్యోతి వెలిగిస్తున్న న్యాయమూర్తి గోపాలకృష్ణమూర్తి

తెనాలిటౌన్: మకర సంక్రాంతిని పురస్కరించుకుని పలుచోట్ల అయ్యప్పకు అభిషేకాలు నిర్వహించారు. పట్టణ మారీసుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి గ్రంధి గోపాలకృష్ణమూర్తి-ఝాన్సీ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగఫణిశర్మ విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, వరదా శేషగిరిరావు, పొన్నూరు శశిధరరావు, తాడిపర్తి హరిప్రసాద్, అంకమరాజు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

- మారీసుపేటలో కొండా గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి వివిధ పండ్ల రసాలు, విబూధి చందనాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
- బాలాజీరావుపేటలోని ప్రధాన అయ్యప్ప ఆలయంలో సంక్రాంతి పండుగ వేడుకలను వైభవంగా జరిపారు. ఉదయం అయ్యప్పస్వామివారిని దివ్య మంగళరథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం కర్పూర జ్యోతిని వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు దుర్గా హరిబాబు స్వామి విశేష పూజాకార్యక్రామాలు నిర్వహించారు. స్వామివారికి పాలాభిషేకం చేశారు. అయ్యప్ప మాలధారులకు ఫలహారం, బిక్ష ఏర్పాటుచేశారు. మాలధారులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త చిన్నవెంకటరెడ్డి



పాడాలనే ఉన్నది కార్యక్రమంలో పాటలు పాడుతున్న సఖి, కృష్ణశ్రీ, పద్మశ్రీ

- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- కళలను, కళాకారులను ప్రోత్సహించటమే ప్రధాన లక్ష్యం

కొల్లిపర: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపం సంక్రాంతి పండుగ అని, ఈ పండుగ కుటుంబ సభ్యులను, బంధుమిత్రుల మధ్య ప్రేమానురాగాలను, పెంచుతుందని పారిశ్రామికవేత్త చిన్నవెంకటరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. సోమవారం, మంగళవారం శ్రీ కళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక ప్రదర్శనలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని ప్రాంగణంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు మూడు రోజులు కొనసాగాయి. ఈ సంబరాల్లో భాగంగా ముఖ్య అతిథిగా పారిశ్రామికవేత్త చిన్నవెంకటరెడ్డి, ఎంపీపీ పద్మావతి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్ని జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. సోమవారం ఉదయం మండల స్థాయి లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం నిర్వహించిన పాడా లని ఉంది, కౌసల్యా సుప్రజా రామా నాటిక పలువురిని ఆకట్టుకున్నాయి. 2022–23 సంవత్సరం పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులకు ఉపకార వేతనం అందజేశారు. మంగళవారం సాయంత్రం వెన్నెలొచ్చింది (హాస్యనాటిక), నాన్నా నేనొచ్చేస్తా(నాటిక)లు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. రంగవల్లి(ముగ్గుల పోటీ) లలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. తొలుత సభా ప్రాంగణంలో జరిగిన సభకు బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ నేటి సమాజంలో సాంస్కృతిక కళలు అంతరించిపోతున్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలు చూసిన తరువాతైన యువత మన దేశ సంస్కృతి గురించి అర్థం చేసు కుని ఆచరించాలని కోరారు. ఇలాంటి ప్రోగ్రాం ద్వా రా మన సంస్కృతిని ప్రజలలోకి తీసుకు వెలుతున్న శ్రీ కళానిలయానికి ప్రత్యేక అభినందనలు తెలియజేసి కళానిలయం సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి గుడిబండి మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు ఆరిమంద పెద్ద నాగిరెడ్డి, సహాయ కోశాధికారి అన్నవరపు రమేష్, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, యువత, మహిళలు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

డీవైఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి అప్పారావు

తాడేపల్లిరూరల్: యువతీ యువకుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని డీవైఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఐద్వా, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అప్పారావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని అన్నా రు. విజేతలకు బహుమతులు అందజేశారు. దర్శి చిన్న దుర్గారావు, బొందలపాటి ప్రభాకరరావు, బూరగ జయరావు, నవనీతం, కిట్టు, చిన్న, శ్రీకాంత్,సాయి పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్, వాలీబాల్, కబడ్డీ పోటీలను డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులను జెట్టి బాలరాజు అందజేశారు. కార్యక్రమంలో వమన్న నరసింహారావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, బి. చిరంజీవి, జి.యోహాను, అజయ్ ప్రకాష్ పాల్గొన్నారు.

సాంస్కృతిక విప్లవకారుడు త్రిపురనేని

పాత గుంటూరు: తెలుగు సమాజంలో కవి రాజు త్రిపురనేని రామస్వామి హేతువాద భావజాలంతో సాంస్కృతిక విప్లవకారుడిగా చరిత్రలో ప్రసిద్ధి చెందారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. రింగ్ రోడ్డు లోని ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో కవిరాజు త్రిపురనేని రామస్వామి వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గద్దె మంగయ్య, అలోకం పెద్దబ్బాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అలోకం పెద్దబ్బాయి మాట్లాడుతూ తెలుగు సమాజంలో సాహిత్య, సాంస్కృతిక, భావజాల రంగాల్లో తన హేతువాదంతో త్రిపురనేని రామస్వామి పోరాటం చేశారన్నారు. అనంతరం విల్సన్‌కు కవిరాజు త్రిపురనేని రామస్వామి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, ప్రముఖ సాహిత్య పరిశోధకుడు పారా అశోక్ కుమార్, వల్లూరి తాండవ కృష్ణ, రచయిత జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో పేకాట శిబిరంపై దాడిచేసిన పోలీసులు ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేకాట శిబిరంపై దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.6,150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పెదవడ్లపూడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.4500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.